## క్లుప్తంగా

### డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం



స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధ్యాపకులు

**మద్దిలపాలెం:** డిగ్రీలో ప్రవేశాల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నట్టు వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. స్పెషల్ కేటగిరీలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, ఎక్స్‌ట్రా కరికులం, క్యాప్ విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 25వ తేదీ వరకూ జరుగుతుందన్నారు.

### ఒరిగిన సోలార్ లైట్ స్తంభం



పార్కులో ఒరిగిన విద్యుత్ స్తంభం

**ఆరిలోవ:** జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్ దరి వివేకానందనగర్ పార్కులో సోలార్ లైట్ స్తంభం ఒరిగిపోయింది. కొద్ది నెలల క్రితమే కొద్దిగా పక్కకు ఒరిగిపోయిన ఈ స్తంభం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడుగు భాగం నానిపోయింది. దీంతో మరింత ఎక్కువగా పక్కకు వాలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ పార్కులో సాయంత్రం సమయంలో పిల్లలు ఎక్కువగా ఆటలాడుతుంటారు. పిల్లలు అటువైపు వెళ్లిన సమయంలో స్తంభం కూలిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే జీవీఎంసీ పార్కుల నిర్వహణ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఇక్కడ పక్కకు ఒరిగిపోయిన స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### జీవీఎంసీ కమిషనర్‌కు అభినందనలు



జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న పల్లా దుర్గారావు

**బీచ్ రోడ్డు:** జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 28వ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని దుర్గారావు కోరారు.

### బంగారు వస్తువులు పోగొట్టుకుంటే సంప్రదించండి



బంగారు వస్తువులు

**సీతమ్మధార:** ఇటీవల బంగారు వస్తువులు పోగొట్టుకుంటే తగిన రశీదులతో ఫోర్త్ టౌన్ క్రైం పోలీసులను సంప్రదించాలని స్టేషన్ ఎస్‌ఐ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది నెలల కిందట దొండపర్తిలోని ఒక ఆటో డ్రైవర్‌కు మండగొలుసు, డైమండ్ పార్కు దరి సాయి పార్లర్ వద్ద చైను దొరికాయని తెలిపారు. వీటి కోసం ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో 106 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. వస్తువులు పోగొట్టుకున్న బాధితులు తగు ఆధారాలతో క్రైం పోలీసులను సంప్రదించాలని, రశీదులు పరిశీలించి వస్తువులు ఇచ్చేస్తామని తెలిపారు.







# గళమెత్తాలి.. దశమార్చాలి

- అసెంబ్లీ సమావేశాలపై తూర్పు నియోజకవర్గ ప్రజల ఆశలు
- 'కూటమి'మేనిఫెస్టోపై స్పష్టతకు డిమాండ్
- అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆకాంక్ష
- వాణి బలంగా వినిపించాలని ఎమ్మెల్యే వెలగపూడికి విజ్ఞప్తి

'ఎన్నికల ముందు బోలెడు హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్ పేరుతో పలు ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తామని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. వీటిలో ఒక్క దాని గురించి కూడా ఇంత వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. అధికారంలోకి వచ్చి దాదాపు 45 రోజులు కావస్తోంది. కక్ష సాధింపులకు స్వస్తి పలికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'అని అంటూ పలువురు నియోజకవర్గ ప్రజలు అధికార పార్టీ ఎమ్మెల్యే వెలగపూడిని కోరుతున్నారు.

**ఆరిలోవ/ఎంవీపీ కాలనీ:** తూర్పు నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చాలా వరకు అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. అయినా ఇంకా తీరని సమస్యలు ఉన్నాయి. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు మాత్రం నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారన్న అపవాదు ప్రజల్లో ఉంది. పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించలేకపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో స్థానికులు ఆయా ప్రాంతాలలో ఉన్న సమస్యలను వెలగపూడికి విన్నవించుకున్నారు. కూటమి అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీలు గుప్పించారు. ఆయా సమస్యలు వెంటనే పరిష్కరించేలా ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వెలగపూడి చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు నియోజకవర్గ ప్రజలు తమ మనోగతాన్ని మంగళవారం 'సాక్షి'తో పంచుకున్నారు.



తోటగరువు వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతుబజార్



హనువంతవాక కూడలిలో స్తంభించిన ట్రాఫిక్

### హామీలపై చిత్తశుద్ధి ఏదీ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని వెల్లడించింది. అయితే ప్రస్తుతం తాత్కాలిక బడ్జెట్ పేరుతో కాలయాపన చేయాలని కూటమి ప్రభుత్వం చేస్తున్నట్లు అర్థమవుతుంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖ రైల్వేజోన్‌కు భూ కేటాయింపులు చేయలేదని బీజేపీతో సహ కూటమి నాయకులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. అయితే ప్రస్తుతం కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విశాఖ రైల్వేజోన్ ప్రస్తావనే లేదు. దీనిపై ఒక్క కూటమి నాయకుడు మాట్లాడటం లేదు. స్థానిక బీజేపీ, టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు దీనిపై మాట్లాడాలి. రైల్వేజోన్ ప్రస్తావన లేకపోవడం ఉత్తరాంధ్రకు అన్యాయం చేయడమే అవుతుంది. కేవలం అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడం చూస్తే సీఎం చంద్రబాబుకు రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేనట్లు కనిపిస్తుంది.

– లగుడు గోవిందరావు, విద్యార్థి నాయకుడు

### మాస్టర్ ప్లాన్ రోడ్డుపై ప్రస్తావించాలి



'ఆరిలోవ ప్రాంతంలో రైతుబజార్ లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరిలోవ ప్రజల కోసం పెదగదిలి వద్ద ఎర్నిదుర్గమాంబ ఆలయం ఎదురుగా ఖాళీ స్థలంలో రైతుబజార్ నిర్మాణం చేపట్టింది. ఆ రైతుబజార్ ప్రారంభోత్సవం త్వరగా జరిగేలా ఎమ్మెల్యే వెలగపూడి అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. ఇందిరాగాంధీ నగర్ నుంచి ఆరిలోవ కాలనీ వరకు కంబాలకొండ వెనక రోడ్డు నిర్మాణం కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని గతంలో ఎమ్మెల్యే ప్రజలకు తెలియజేశారు. దీని నిర్మాణం గురించి కూడా అసెంబ్లీలో ప్రస్తావించాలి.

– చింతా శ్రీను, శాంతినగర్, 10వ వార్డు

### హనుమంతవాక వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి



జాతీయ రహదారిపై హనుమంతవాక వద్ద నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ కూడలి దాటడానికి ఆరిలోవ, సింహాచలం వైపు నుంచి నగరానికి వెళ్లేవారు ఒక్కోసారి రెండు, మూడు సిగ్నల్స్ వరకు ఆగాల్సి వస్తోంది. మధురవాడ నుంచి వెళ్లే వారిది కూడా ఇదే పరిస్థితి. ఈ కూడలి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడానికి కృషి చేస్తానని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెలగపూడి హామీ ఇచ్చారు. దీని నిర్మాణం కోసం అసెంబ్లీలో ప్రస్తావించాలి. అలాగే హనుమంతవాక నుంచి దీన్‌దయాళ్‌పురం వరకు కొండవాలులో చాలా చోట్ల రక్షణ గోడలు లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వాటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలి.

– నీలాపు రామ్మోహన్‌రెడ్డి, సింహగిరి కాలనీ

### ఏయూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏళ్ల తరబడి అనేక మంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. టైం స్కేల్, కన్సాలిడేట్ పే ఉద్యోగులుగా చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గెస్ట్ ఫ్యాకల్టీలను పునః నియమిస్తామని కూడా వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సైతం ఈ మేరకు హామీ ఇచ్చారు. ఆ దిశగా కార్యాచరణ చేపట్టి ఆయా ఉద్యోగులను రెగ్యులర్ చేసి భద్రత కల్పించాలని కోరుతున్నాం.

– సిర్లా శ్యామ్, ఎంవీపీ కాలనీ

### తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలి



టీడీపీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పారు. దీనిని కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో సైతం చేర్చారు. నోటిఫికేషన్లు, ఉద్యోగ నియామకాలు ఆలస్యమయ్యేలా ఉందని, తక్షణమే రాష్ట్రంలోని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని అమలు చేసి కూటమి ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకోవాలి.

– శ్యామ్, ఏయూ అవుట్‌గేట్

## న్యూఢిల్లీకి వైఎస్సార్‌సీపీ నాయకుల పయనం

**బీచ్ రోడ్డు:** రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు వ్యతిరేకంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో బుధవారం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు ఆ పార్టీ తూర్పు నియోజకవర్గం నాయకులు ప్రయాణం అయ్యారు. పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు, పీతల గోవింద్, సంపంగి సురేష్, తదితరులు మంగళవారం బయలుదేరారు.



ఢిల్లీకి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నాయకులు

## కందిపప్పు, బియ్యం కౌంటర్ పరిశీలన

**ఆరిలోవ:** ఎంవీపీ రైతుబజార్‌ను మంగళవారం పౌర సరఫరాల జిల్లా అధికారి సూర్యప్రకాష్‌రావు సందర్శించారు. తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం విక్రయిస్తున్న ప్రత్యేక కౌంటర్‌ను పరిశీలించారు. ఇంత వరకు ఎన్ని కిలోలు బియ్యం, కందిపప్పు విక్రయాలు జరిగాయో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ ఎంవీపీ రైతుబజార్‌లో తక్కువ ధరకు విక్రయించే బియ్యం, కందిపప్పు నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. కిలో కంది పప్పు రూ.160, కిలో బియ్యం రూ.49కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక కౌంటర్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 1,306 కిలోల కంది పప్పు, 5,535 కిలోల బీపీటీ సన్నాలు బియ్యం విక్రయాలు జరిగాయన్నారు. వినియోగదారులు ఈ కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఎంవీపీ రైతుబజార్‌లో కందిపప్పు, బియ్యం కౌంటర్‌ను పరిశీలిస్తున్న పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాష్

## టెలికాం సేవలపై విస్తృత అవగాహన



మాట్లాడుతున్న టెలికాం ఏపీ శాఖ అడిషనల్ డీజీ జేవీ రాజారెడ్డి

**దాబాగార్డెన్స్:** అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం టెలికాం పాయింట్ ఆఫ్ సేల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ టెలికాం శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ జేవీ రాజారెడ్డి, డైరెక్టర్ జేవీ మనోజ్‌కుమార్‌తో పాటు పీజీఎంటీడీ పాల్ విలియమ్స్, పీజీఎం (ఒ) ఆడమ్ గొల్లమూడి అవగాహన కల్పించారు. ప్రతి వినియోగదారుని టెలికాం సేవల నమోదు ప్రక్రియ, ఆన్‌బోర్డింగ్ సమయంలో వినియోగదారుని పూర్తి వివరాలు సమగ్రంగా ధ్రువీకరించుకునే అంశానికి సంబంధించి ప్రాముఖ్యత గురించి వివరించారు. దేశీయంగా నానాటికీ పెరుగుతున్న సాంకేతికత, వివిధ సాంఘిక, ఆర్థిక కార్యకలాపాలకు ఉపయుక్తంగా ఉన్న ఆన్‌లైన్ సేవలు, టెలికాం వనరులు, మరీ ముఖ్యంగా మొబైల్ సేవలపై వివరించారు. పాయింట్ ఆఫ్ సేల్ ప్రతినిధి, సిమ్‌లు విక్రయించేవారు నకిలీ ధ్రువపత్రాలతో సిమ్ జారీ చేయకుండా చూసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, మోసపూరిత చర్యలకు పాల్పడుతున్న దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలన్నారు. భారత పౌరుల డాటా భద్రతకు టెలికాం శాఖ చేపడుతున్న వివిధ ప్రక్రియలు, ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన సంచార్ సాథి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. భారత పౌరుడు తన పేరిట ఉన్న మొబైల్ కనెక్షన్స్ తెలుసుకుని, ఆయా మొబైల్ కనెక్షన్లను ఈ సంచార్ సాథి పోర్టల్ ద్వారా డిస్‌కనెక్ట్ లేదా బ్లాక్ చేసుకోవచ్చని, మొబైల్ ఫోన్ తస్కరించబడినట్టయితే ఆ మొబైల్ ఫోన్ వివరాలు, మొబైల్ డివైసెస్ యదార్థత ఈ పోర్టల్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని చెప్పారు. నకిలీ, మోసపూరిత ఫోన్‌కాల్స్‌పై ఫిర్యాదును ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని, అలాగే ఈ పోర్టల్ ద్వారా మీ టెలికాం ఆపరేటర్ వివరాలు, మొబైల్ ఈఎంఐ వివరాలు, విదేశీ కాల్స్ నుంచి వస్తున్న మోసపూరిత కాల్స్ వంటి సేవలు పొందవచ్చని చెప్పారు. సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలపై జాతీయ నేర ఫిర్యాదుల పోర్టల్ www.cybercrime.gov.in ఇప్పటికే పని చేస్తుందని, అంతేగాక 1930కి కాల్ చేసి ఫిర్యాదు చెయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులు, రిటైలర్లు, పాయింట్ ఆఫ్ సేల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రయోగాత్మక సినిమా 'కళ్లు'

**సీతంపేట:** కళ్లు ఒక ప్రయోగాత్మక సినిమా అని, విశాఖలోని ఎంతో మంది వ్యక్తుల సహకారం, స్థానిక కళాకారులతో ఈ చిత్రం తీశామని దర్శకుడు ఎం.వి.రఘు అన్నారు. కళ్లు చిత్రం తీసి 35 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రంగసాయి మీడియా వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు మాట్లాడుతూ స్వాతి ముత్యం సినిమా వచ్చిన రోజుల్లో కళ్లు సినిమా తీశామన్నారు. గొల్లపూడి మారుతీరావు రచించిన నాటికను సినిమాగా తీశామని తెలిపారు. ఈ సినిమాకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు, సిరివెన్నెల సాహిత్యం సినిమాకి హైలెట్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కళ్లు సినిమాకు 24 అవార్డులు రాగా, అందులో దర్శకుడికి 11 అవార్డులు రావడం విశేషమన్నారు. 1988లో విడుదలైన సినిమా వందరోజులు ఆడిందన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు, ఇతర కళాకారులను సత్కరించారు. అనంతరం కళ్లు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రంగసాయి ప్రతినిధి ఎస్.నాగేశ్వరరావు, ఎంవీఎస్ హరనాథరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళ్లు చిదంబరం కుమారుడు రామకృష్ణ, జనసేన నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు ఎంవీ రఘు

### చక్కెర స్థాయి పెరిగితే రెటినా సమస్యలు

**ఆరిలోవ:** డయాబెటిక్‌తో బాధపడుతున్న వారిలో చక్కెర స్థాయి రక్తంలో ఎక్కువైతే రెటినా రక్త నాళాలు దెబ్బతిని సమస్యలు ఏర్పడతాయని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ రుద్విజ్ పాండ్యా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన హనుమంతవాక వద్ద ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో డయాబెటిక్‌తో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించారు. డయాబెటిక్ రెటినోపతి అనేది కళ్లను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని పాండ్యా చెప్పారు. దీనికి సకాలంలో చికిత్స అందించాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో కాంతిని గ్రహించే శక్తి కోల్పోతారన్నారు. ఇది దృష్టి సమస్యకు దారి తీస్తుందన్నారు. డయాబెటిక్ రెటీనోపతి వల్ల దృష్టిని కోల్పోయే ప్రమాదాన్ని ముందస్తు చికిత్స ద్వారా నివారించవచ్చన్నారు. ఎప్పటికప్పుడు సాధారణ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో చికిత్సకు సంబంధించి అత్యాధునిక పరికరాలు, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

### ఘనంగా భూలోకమాత జాతర



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

**మద్దిలపాలెం:** కొత్త వెంకోజీపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీభూలోకమాత అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఘటాలను తలపై పెట్టుకుని ఊరేగించారు. జాతర సందర్భంగా కొత్త వెంకోజీపాలెంలో సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించాలి

**మహారాణిపేట:** స్టాప్ డయేరియాపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. యూపీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు ఎంత మంది ఉన్నారో జాబితా సిద్ధం చేయాలని, ఎనీమియా లబ్ధిదారులను గుర్తించాలని ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు తెలిపారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు.

### ఎన్‌సీసీతో సేవాభావం చాటుకునే అవకాశం



రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

**దాబాగార్డెన్స్:** విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మీ ఫోర్స్ ఇన్ ఇండియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుతూ యువత దేశాభిమానం, సేవాభావాన్ని చాటుకునేందుకు ఎన్‌సీసీ చక్కటి అవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ వైవీహెచ్ఎస్ ప్రసాద్ ఆర్మీ ఫోర్స్‌లో ఉన్న అవకాశాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలి మాట్లాడుతూ దేశాన్ని రక్షించే సైనికులకు ఎంతటి గౌరవం ఉంటుందో, అంతటి గౌరవం ఎన్‌సీసీ క్యాడెట్లకు కూడా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్స్‌లు చెల్లించాలి

**మద్దిలపాలెం:** ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న అలవెన్స్‌లను తక్షణం ప్రభుత్వం చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ మోహనరావును మంగళగిరిలో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సానుకూలంగా స్పందించారని, త్వరలో బకాయిలు చెల్లించనున్నామని చెప్పారని రమణారెడ్డి తెలిపారు. డిపోల వారీగా బకాయి ఉన్న ఉద్యోగులకు వేతనంతో కలిపి చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ మోహనరావుకు వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

**ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి**

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఏపీపీటీడీ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండేను మంగళవారం మంగళగిరిలో కలిసి వినతి పత్రం అందజేశారు. ముందుగా ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి పరిచయం చేసుకున్నామన్నారు. అనంతరం ఆయనకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల గురించి వివరించామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని రమణారెడ్డి తెలిపారు. ఈ ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



శ్రీకృష్ణాపురం గురుకులంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా విభాగం అధికారులు

**ఆరిలోవ:** సీజనల్ వ్యాధులపై అందరికీ అవగాహన అవసరమని మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ అన్నారు. జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు మలేరియా విభాగం అధికారులు మంగళవారం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ కారక దోమల గురించి వివరించారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హాస్టళ్లలో వసతి గదులు, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## యువత క్రమ శిక్షణతో మెలగాలి

**ఆరిలోవ:** యువత క్రమ శిక్షణతో మెలిగి భవిష్యత్తు ఉన్నతికి బాటలు వేసుకోవాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న వ్యవహారాలపై యువతకు ఆరిలోవ కాలనీలో మంగళవారం అవగాహన కల్పించారు. హెల్త్‌సిటీ వెనక ఖాళీ స్థలంలో ఆయన యువకులతో మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో కొందరు యువతీ యువకులు చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. గంజాయి, మద్యం, ఘర్షణల జోలుకు వెళ్లకుండా ఉండాలన్నారు. ఈ ప్రాంతంలో గంజాయి తరలించేవారు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



ఆరిలోవ కాలనీలో యువతతో మాట్లాడుతున్న ఆరిలోవ సీఐ గోవిందరావు